క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం పోరంకి సెక్షన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. డొంక రోడ్డు, నిడమానూరు రోడ్డు, బ్రహ్మంగారి గుడి, ప్రభునగర్, క్యాపిటల్ ఆస్పత్రి ప్రాంతం, పోరంకి సెంటర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. స్థానికులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నిత్యహోమం, శ్రీ లక్ష్మి నరసింహ సుదర్శన హోమం, పలు పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. 4 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వైశాఖ మాసంలో వచ్చిన శ్రవణ నక్షత్రం కావటంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణవేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చకస్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేనపూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా తిరుమంజనం స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన సేవ, వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష ఆదరణ



వీరవల్లిలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



ఉయ్యూరులో దేశ చరిత్రను బోధిస్తున్న రీసోర్స్ పర్సన్ సింహాచలం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. విద్యార్థులు ఉదయాన్నే గ్రంథాలయాలకు చేరుకుని శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ రకాల అంశాలపై లైబ్రేరియన్ స్వర్ణలత ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. కథలు చెప్పటం, కథలు చదవటం, జనరల్ నాలెడ్జ్, నృత్యాలు, చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్‌పై బుధవారం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అంతేకాక చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించారు.

వణుకూరులో ఆటల పోటీలు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా తొలుత విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించటం చేశారు. అనంతరం గ్రంథాలయ అధికారి భారతి విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్, ఖో ఖో, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించటానికి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పెనమలూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మెడిటేషన్‌లో భాగంగా యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించామని శాఖ గ్రంథాలయ అధికారి హరీషా తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కంకిపాడు: గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెన్నేరు శాఖ గ్రంథాలయాధికారి ఎస్.సునీత తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ.. క్రీడలు, ఆధ్యాత్మికం, చదువు అన్నింటా రాణించాలని సూచించారు.



తెన్నేరులో భగవద్గీత శ్లోకాలు పఠనం చేస్తున్న విద్యార్థులు

జూన్ 6 వరకు తరగతులు

ఉంగుటూరు: మండలంలో ఉంగుటూరు, తేలప్రోలు, ఆత్కూరు, మానికొండ జిల్లా శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలకు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బి.వి.రామకృష్ణ మాట్లాడుతూ జూన్ నెల 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు.



ఆత్కూరులో విద్యార్థులతో కథలు వినిపిస్తున్న లైబ్రేరియన్ రామకృష్ణ

పుస్తక పఠనంతో ఉన్నత భవిష్యత్

గన్నవరంరూరల్: పుస్తక పఠనంతో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ సాధ్యమని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం గొప్పదనాన్ని వివరించారు. నేటి కాలంలో చిన్ననాటి నుంచి విద్యార్థులను పుస్తకాలు చదివించే ప్రక్రియను మరింతగా అలవాటు చేసేందుకు గ్రంథాలయ శాఖ ఈ సమ్మర్ క్యాంప్‌లు ఏర్పాటు చేసిందన్నారు. అక్షర జ్ఞానంతో ప్రతి ఒక్కరూ వారి జీవితాలను కాంతిమయం చేసుకుంటారని, విద్యార్థులు ఈ విషయాలను ప్రతి రోజు మననం చేసుకోవాలని చెప్పారు. సచివాలయ మహిళా పోలీస్ జంపన జాగృతి విద్యార్థులకు చిన్న నాటి నుంచి పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి పర్యవేక్షణలో విద్యార్థులకు యోగా నేర్పించారు. నీతి కథలు చెప్పించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధోశక్తి

ఉయ్యూరు: పుస్తక పఠనంతో మేధోశక్తి పెరుగుతుందని రీసోర్సు పర్సన్ ఎం.సింహాచలం నాయుడు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉయ్యూరు గ్రంథాలయంలో బుధవారం దేశ చరిత్ర-నైసర్గిక స్వరూపం, నదులు, వాటి ప్రాధాన్యతపై శిక్షణ ఇచ్చారు. రీసోర్స్‌పర్సన్ సింహాచలం నాయుడు ఆయా అంశాలపై విద్యార్థులకు బోధించి, అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.



వణుకూరులో ఖో ఖో ఆడుతున్న చిన్నారులు



పురుషోత్తపట్నంలో విద్యార్థులకు జాగ్రత్తలు వివరిస్తున్న మహిళా పోలీస్ జాగృతి

స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్య పుస్తకాలు

- పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు
- పంపిణీకి పుస్తకాలు సిద్ధం
- పాఠశాలలకు తరలించే పనుల్లో అధికారులు

కంకిపాడు: పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే స్టాక్ పాయింట్‌కు పాఠ్య పుస్తకాలను చేర్చారు. తరగతుల వారీగా పాఠ్య పుస్తకాలను వేరుచేసి పాఠశాలలకు తరలించే పనుల్లో మండల విద్యాశాఖ నిమగ్నమైంది.

రెండు రోజుల్లో మరిన్ని పుస్తకాలు..

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను అందించేందుకు చర్యలు విద్యాశాఖ తీసుకుంది. కంకిపాడు మండలంలోని పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టాక్ పాయింట్‌గా ఏర్పాటుచేసి ఇక్కడి నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను తరలించనున్నారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకూ 16 వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటికే 11,185 పాఠ్య పుస్తకాలను స్టాక్ పాయింట్‌కు తరలించారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 17,523 పుస్తకాలు ఇండెంట్ పెట్టగా 16,748 పుస్తకాలు వచ్చాయి. మొత్తంగా ఆరు వేల పుస్తకాలు ఇంకా అందాల్సి ఉంది. ఒకటి, రెండు రోజుల్లో అవి కూడా స్టాక్ పాయింట్‌కు చేరే అవకాశం ఉంది.

నోటు పుస్తకాలు సిద్ధం

పాఠ్య పుస్తకాలతో పాటుగా నోటు పుస్తకాలను కూడా అందిస్తుంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 26,118 నోటు పుస్తకాలు అవసరం ఉంది. ఆ మొత్తం పుస్తకాలు స్టాక్ పాయింట్‌లో సిద్ధంగా ఉన్నాయి. తరగతుల వారీగా విద్యార్థులు సంఖ్యను బట్టి విభజించి పంపిణీకి సిద్ధం చేశారు.

స్కూళ్లు తెరిచే నాటికి పుస్తకాలు సిద్ధం

ఇండెంట్‌కు అనుగుణంగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. స్కూళ్లు తెరిచే నాటికి ఆయా పాఠశాలలకు పుస్తకాలను తరలిస్తాం. ఇప్పటికే పూర్తి స్థాయిలో నోటు పుస్తకాలు స్టాక్ పాయింట్‌లో ఉన్నాయి. విద్యా శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా శాఖాపరమైన చర్యలను సమర్థంగా తీసుకుంటాం.

– కె.ప్రసాద్, ఎంఈఓ, కంకిపాడు



పునాదిపాడు జెడ్పీ పాఠశాలకు చేర్చిన పాఠ్య పుస్తకాలు

కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

విజయవాడరూరల్: వచ్చే నెల 4వ తేదీన జరిగే సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని సెంట్రల్ ఏసీపీ పి.భాస్కరరావు చెప్పారు. విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రూరల్ మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ భాస్కరరావు మాట్లాడుతూ.. కౌంటింగ్ ప్రక్రియ దృష్ట్యా ఎటువంటి అల్లర్లు, ర్యాలీలు గొడవలు జరగరాదన్నారు. కౌంటింగ్ రోజున ఎవరైనా ఉద్దేశపూర్వకంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. సమావేశంలో రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ భాస్కరరావు

సగర్ల సంక్షేమ సంఘ నాయకుడు గండికోట మృతి



గండికోట సీతారామయ్య(ఫైల్)

గన్నవరం: మండలంలోని బుద్దవరం శివారు రాజీవ్ నగర్‌కాలనీకి చెందిన సగర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట సీతారామయ్య(58) బుధవారం కన్నుమూశారు. మంగళవారం సాయంత్రం అస్వస్థతకు గురైన ఆయన విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీతారామయ్య మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు. రాజీవ్‌నగర్‌కాలనీలోని శ్రీసంతానవిజయ కనకదుర్గదేవి ఆలయ అధ్యక్షుడిగా, రియల్ ఎస్టేట్ మధ్యవర్తుల సంఘం గౌరవాధ్యక్షుడిగా సీతారామయ్య వ్యవహరించారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెనమలూరు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరుకు చెందిన సొంటి సురేష్ చోడవరం నాగేంద్రస్వామి గుడి వద్ద మద్యం అక్రమంగా విక్రయిస్తుండటంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకన్నారు. అతని వద్ద 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బుధవారం బాటసారులు, ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. లోకసాని కృష్ణారెడ్డి, లోకసాని నాగార్జున రెడ్డి జ్ఞాపకార్థం దాత లోకసాని రోహిణి సహకారంతో ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ మాట్లాడుతూ దాతల సహకారంతో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరిస్తున్నారని, వేసవి పూర్తయ్యే వరకు ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

వ్యాన్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో వ్యాన్ల ద్వారా చెత్త సేకరిస్తున్న డ్రైవర్లకు కాంట్రాక్టర్ గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని వ్యాన్ డ్రైవర్లు బుధవారం పోరంకిలో వినూత్న నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ.. చెత్త సేకరిస్తున్న డ్రైవర్ల పట్ల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపాలిటీ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నిధులు చెల్లిస్తున్నా కాంట్రాక్టర్ మాత్రం డ్రైవర్లకు మొండి చేయి చూపుతున్నారని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా కల్పించుకోని వ్యాన్ డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో వ్యాన్ డ్రైవర్లు పాల్గొన్నారు.

అనధికార హోర్డింగ్‌లను తొలగించండి



పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరంలోని అన్ని ప్రాంతాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని, ఏజెన్సీకి ఇచ్చిన గడువు పూర్తయితే, స్ట్రక్చరల్ స్టెబిలిటీ లేని హోర్డింగ్‌లను సైతం తొలగించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం ఆయన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సెక్రటరీలతో స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్‌లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో ప్లానింగ్ సెక్రటరీలకు దీనిపై పలు సూచనలు చేశామని తెలిపారు. ఎంతవరకు పురోగతి సాధించారని కమిషనర్ ప్రశ్నించగా ఇప్పటి వరకు 224 ఖాళీ హోర్డింగ్ ఫ్రేమ్‌లను తొలగించామని, స్ట్రక్చరల్ స్టెబిలిటీపై ఇప్పటికే పలు ఏజెన్సీలకు నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. జూన్ మొదటి వారంలో సర్టిఫికెట్ తీసుకోని వాటిని తొలగిస్తామని అధికారులు కమిషనర్‌కు నివేదించారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీ జీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, టీపీఓలు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.